ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.33 | సహర్ : 4.56 (శనివారం)

ANDHRAJYOTHY



5

యాదాద్రి భువనగిరి

శుక్రవారం 22 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 | కనిష్ఠం 23.0

యాదగిరిక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

పరిసమాప్తం

- శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేక పూజలు
- రాత్రికి శృంగార డోలోత్సవం
- నేటి నుంచి నిత్య కల్యాణం, సుదర్శన హోమ పూజలు ఆరంభం



స్వామివారికి శృంగార డోలోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



స్వయంభూ పంచనారసింహుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన గురువారం ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రికి శృంగార డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో సిద్ధంగా ఉంచిన 108 వెండి కలశాలలో గంగాది సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపిన అర్చకస్వాములు దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి విశ్వక్సేనుడిని ఆరాధిస్తూ హోమం, పూర్ణాహుతి పర్వాలు జరిపి అష్టోత్తర శతఘటాభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

•7లో..

టికెట్లపై ఉత్కంఠ



- అభ్యర్థుల ఖరారులో జాప్యం చేస్తున్న బీఆర్ఎస్
- భువనగిరి సీటుపై కాంగ్రెస్‌లో పోటాపోటీ
- హోలీ వరకు వేచి ఉండాల్సిందేనంటున్న అధిష్ఠానాలు
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లకు బీఆర్ఎస్, భువనగిరి స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపికచేయడంలో జరుగుతున్న జాప్యం ఉత్కంఠను రేపుతోంది. భువనగిరి సీటుకు కాంగ్రెస్‌లో తీవ్రపోటీ నెలకొనడంతో ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడంతో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు దీటైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు బీఆర్ఎస్ యత్నిస్తోంది. భువనగిరి స్థానంలో బీజేపీ నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్‌కు టికెట్ కేటాయించడంతో ఆయన ప్రచారం కొనసాగిస్తుంటే, ఆ స్థానంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోనూ బీసీలకు టికెట్లివ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ టికెట్ల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో పోటాపోటీ నెలకొనడం, అధిష్ఠానాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండడంతో అభ్యర్థుల ఎంపిక మరింత జాప్యం కానున్నట్టు తెలుస్తోంది. హోలీకి ఒకరోజు ముందు, లేదా పండుగ తర్వాత అభ్యర్థుల ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

నల్లగొండ, భువనగిరి స్థానాల్లో బీఆర్ఎస్ ఎవరిని బరిలో దింపుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. తొలుత ఈ స్థానాల్లో అధిష్ఠానం అవకాశం కల్పిస్తే పోటీచేస్తారని భావించిన గుత్తా అమిత్‌రెడ్డి, చివరికి పోటీ నుంచి విరమించుకున్నారు. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరి అభ్యర్థిగా బరిలోకి వచ్చారు. మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి సైతం బీజేపీ వైపే చూస్తున్నారనే సమాచారంతో నల్లగొండ నుంచి ఎవరిని బరిలో దింపాలనే అంశంపై పార్టీ ముఖ్యనేతలతో అధినేత కేసీఆర్ చర్చిస్తున్నట్లు తెలిసింది. ఈ స్థానంలో అవకాశమిస్తే పోటీకి సిద్ధమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి పార్టీ అధినేతకు, ఇతర ముఖ్యనేతలకు చెప్పడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. పార్టీ కీలక నేతలు, మాజీ ఎమ్మెల్యేల మద్దతు తమకే ఉందని, టికెట్ ఇస్తే గెలిచి తీరుతామని కంచర్ల బ్రదర్స్ అధిష్ఠానం వద్ద పట్టుబడుతున్నారు.

● పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి సైతం తనకు ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించాలని పార్టీ అధినేత కేసీఆర్‌కు విన్నవించారు. 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి తాను పార్టీలో ఉన్నానని, ఉద్యమకారుల కోటాలో తనకు మాజీ సీఎం కేసీఆర్ అవకాశం కల్పిస్తారని ఆయన ధీమాతో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో తనకు ఎలాంటి అవకాశాలు రాలేదని, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఈ దఫా తనకు ఎంపీగా పోటీచాన్స్ దక్కుతుందని చెబుతున్నారు. వీరితో పాటు సామాజికసమీకరణాలను దృష్టిలో ఉంచుకొని బీసీ, ఎస్టీ వర్గాల నేతలను బరిలో దింపే అంశంపైనా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.



● భువనగిరి స్థానంలోనూ బీఆర్ఎస్ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానంలో బీజేపీ నుంచి ఇప్పటికే బీఆర్ఎస్ పూర్వ ఎంపీ, బీసీ నేత డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు కేటాయించడంతో బీఆర్ఎస్ నుంచి కూడా మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను బరిలో దింపుతారనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. అయితే ఈ స్థానంలో తనకు అవకాశం దక్కుతుందనే ధీమాతో తెలంగాణ ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి అధిష్ఠానం వద్ద పావులు కదుపుతున్నారు. మరో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి పోటీచేస్తారని చర్చ సాగుతుంటే, కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఆయన చేరికను వ్యతిరేకిస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

● భువనగిరి నుంచి తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మికి పోటీ అవకాశం కల్పించాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పట్టుబడుతుంటే, సీఎం ముఖ్య అనుచరుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి టికెట్ వస్తుందనే ధీమాలో ఉన్నారు. పార్టీ అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమని గుత్తా అమిత్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, పున్నా కైలాష్‌నేత, చనగాని యాదగిరిగౌడ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెండు స్థానాల్లో బీఆర్ఎస్, భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి తేలితే గానీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

పట్టుబడిన నగదు, వస్తువుల విడుదలకు గ్రీవెన్స్ కమిటీ

కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, మార్చి 21: ఎన్నికల నిబంధనల మేరకు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువుల విడుదలకు గ్రీవెన్స్ కమిటీని సిద్ధం చేసినట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ లోక్‌సభ సాధారణ ఎన్నికల దృష్ట్యా ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినందున పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైలైన్స్ టీంలు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న రూ.50వేలకు మించి నగదు, ఇతర వస్తువులను పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తరలించవద్దని, అలా పట్టుబడిన నగదును సీజ్‌చేసి డిపాజిట్ చేస్తామన్నారు. ఎన్నికలకు సంబంధం లేదని ఆధారాలు చూపితే తిరిగి ఇచ్చేస్తామని, అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, వివాహం ఇతర అవసరాలకు తరలించే వారు సరైన పత్రాలతో నగదు తీసుకెళ్ల వచ్చన్నారు. ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై అప్పీలు చేసుకునేందుకు సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకునేందుకు గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ జే.రాజేశ్వర్‌రెడ్డి (సెల్ 9848156183)ని సంప్రదించాలన్నారు.



కలెక్టరేట్‌లో వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్డీవో ఎంఏ కృష్ణన్

భువనగిరి రూరల్, మార్చి 21: కూలీల వలసలను నివారించేందుకు ప్రభుత్వాలు అమలుచేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో ఎంఏ.కృష్ణన్ అన్నారు. గురువారం మండలంలోని అనాజీపురంలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అదే విధంగా కూలీలకు పని ప్రదేశంలో అన్ని వసతులు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో మొక్కలకు సకాలంలో నీరు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్‌రావు, ఏపీవో బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో ఎంఏ కృష్ణన్

ఎన్నికలను రాజకీయ క్రీడగా భావిస్తున్న పార్టీలు

- ప్రజా సమస్యలను చట్టసభల్లో విన్పించేందుకే పోటీలో ఉన్నాం
- పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

యాదాద్రి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలను రాజకీయ క్రీడగా భావించి పలు పార్టీలు పోటీ పడుతున్నాయని, తమ పార్టీ మాత్రం బాధ్యతాయుతంగా ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపించేందుకు పోటీలో ఉన్నామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. గురువారం భువనగిరిలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంతో పాటు సబ్బండవర్గాలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. బూర్జువ పార్టీలు ప్రజా చైతన్యాన్ని అణచివేసేందుకు డబ్బు, కులాన్ని, మతాన్ని వాడుకుంటున్నాయన్నారు. ప్రజల్లోకి నిజాయితీగా వెళ్లి ఓటుహక్కు అడిగే నైతిక హక్కు సీపీఎంకే ఉందన్నారు. ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లిన నేతలు సీపీఎంలో ఉన్నారని, ప్రస్తుతం పోటీలో ఉన్న నేతలెవరైనా ప్రజాసమస్యల కోసం జైలుకు వెళ్లిన వారు, ఉద్యమించిన వారు ఉన్నారా ఆయన ప్రశ్నించారు. భువనగిరి లోక్‌సభస్థానం పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలుమార్లు ఎమ్మెల్యేలుగా గెలిచి ప్రజలకు సేవ చేసిన ఘనత సీపీఎంకు ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన సీపీఎం త్యాగాలను గుర్తుచేసుకోవాలని, పార్టీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ, జిల్లాల్లో సాగునీటి సమస్యపై 72గంటల దీక్షలు, కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నాలు, బస్వాపూర్ రిజర్వాయర్, మూసీ పరిరక్షణ కోసం పలు ఉద్యమాలు చేపట్టామన్నారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం పోరాట పటిమ గల అభ్యర్థిని ప్రజలు ఎన్నుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, మంగ నర్సింహులు, మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సింరెడ్డి, దాసరిపాండు, దయ్యాల నరసింహ, బబ్బూరి పోశెట్టి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, వనం రాజు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

'పది' పరీక్షలకు 9,099మంది

హాజరు

భువనగిరి అర్బన్, మార్చి 21: జిల్లాలో పదో తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా సాగాయి. ఆంగ్లం పరీక్షకు 9,123మంది విద్యార్థులకు 9,099మంది హాజరు కాగా, 25మంది గైర్హాజయ్యారు. ప్రైవేట్ విద్యార్థులకు 16మందికి 15మంది పరీక్షలు రాశారు. జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాలను డీఈవో నారాయణరెడ్డి, జిల్లా కేంద్రంలోని మూడు కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్, 16 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, తొమ్మిది కేంద్రాలను ఆయా మండలాల పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు తనిఖీచేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

భువనగిరి టౌన్, మార్చి 21: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మహిళలు బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి చంద్ర పిలుపునిచ్చారు. గురువారం భువనగిరిలో జరిగిన మోర్చా సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో మహిళలను గౌరవిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. మహిళల సామాజిక, ఆర్థిక భద్రతకు ప్రధాని నరేంద్ర మోదీ అగ్ర ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మహిళా వికాసం కోసం మరోమారు ప్రధాని మోదీకి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కుమ్మరిండ్ల లక్ష్మీ, లక్కాకుల మాధవి, జక్కుల శ్రీవాణి, రంగా రేఖ, నూనె మాధవి, ప్రధాన కార్యదర్శిగా ముగిరెడ్డి శ్రావణి, సహాయ కార్యదర్శిగా అన్నం శోభ, సోషల్ మీడియా జిల్లా మహిళా కన్వీనర్‌గా వెంపటి రమ్యను ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. అలాగే బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా మంగు నరసింహారావును నియమించినట్లు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

దేవస్థానం ఉద్యోగులను బదిలీ చేయాలి

సీపీఐ పక్షనేత సాంబశివరావును కోరిన నేతలు

యాదగిరిగుట్ట రూరల్, మార్చి21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీకి సహకరించాలని గురువారం హైదరాబాద్‌లో సీపీఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివరావుకు సీపీఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేవస్థాన పునర్నిర్మాణంలో అవకతవకలపై విచారణ చేయించి అక్రమాలకు పాల్పడిన ప్రతీ ఒక్కరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల బదిలీలు లేకపోవడంతో ఇక్కడే ఉద్యోగ విరమణ పొందుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్ల ఆలయ ఈవోగా విధులు నిర్వహించిన గీతారెడ్డి, సీనియర్ ఉద్యోగులను పట్టించుకోకుండా జూనియర్లకు పదోన్నతులు కల్పించారని, దీనిపై విచారణ చేయించాలన్నారు. ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయకపోవడంతో అవినీతికి అంతులేకుండా పోయిందని, వెంటనే ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో సింహద్వారం ఎదురుగా బ్రిడ్జి నిర్మించడంతో వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వెంటనే దీన్ని తొలగించాలని కోరారు. కొండపైన సురక్షణ కాంట్రాక్టు కాలం ముగిసినా కొనసాగిస్తున్నారని, కొత్త కాంట్రాక్టర్లకు అవకాశం ఇచ్చి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. దీనిపై కూనంనేని సాంబశివరావు స్పందించి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, జంగమ్మ, బబ్బూరి శ్రీధర్, కళ్లెపల్లి మహేందర్, పేరబోయిన మహేందర్, గోరేటి రాములు, పేరబోయిన బంగారి, గోపిరాజు పాల్గొన్నారు.



కూనంనేనికి వినతిపత్రం అంజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద, నాయకులు

పుస్తెలతాడు చోరీ చేసిన నిందితుడిఅరెస్ట్

భువనగిరి రూరల్, మార్చి 21: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనరేట్ భువనగిరి జోన్ డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. గురువారం ఏసీపీ రవికిరణ్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 15న మండలంలోని బస్వాపురానికి చెందిన దంపతులు పులి రాంచందర్, చంద్రకళ భువనగిరి పట్టణంలోని రైతు బజారు నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లికి చెందిన ఎల్లెంల మధు మార్గంమధ్యలో బస్వాపూర్ శివారులో ఈ నెల 15న రాత్రి వేళలో వారిని అడ్డగించి ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న చంద్రకళ మెడలోంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన రూరల్ సీఐ ఎం.ప్రభాకరరెడ్డి, ఎస్ఐలు వి.సంతోష్‌కుమార్, నాగశివప్రసాద్ గురువారం భువనగిరి శివారులోని రాయిగిరి వద్ద మధును ప్రశ్నించగా తాను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, ట్రాక్టర్ ఫైనాన్స్‌కు సంబంధించి బాకీ చెల్లించేందుకు ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు దొంగిలించానని నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు, బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

యాదగిరీశుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

● స్వయంభువులకు శాస్త్రోక్తంగా అష్టోత్తర శతఘటాభిషేకం ● రాత్రివేళ శృంగార డోలోత్సవం

స్వయంభు పంచనారసింహుడు.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రివేళ స్వామి, అమ్మవార్లను కొలుస్తూ లాలిపాటలతో నిర్వహించిన శృంగార డోలారోహణంతో వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

● యాదగిరిగుట్ట

బ్రహ్మోత్సవాల్లో ఆసాంతం భక్తజనులను కటాక్షించేందుకు దశావతారాలు, వివిధ వాహనసేవల్లో అనుగ్రహించిన లక్ష్మీనరసింహుడిని 108 కలశాలతో వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించారు. ప్రధానాలయ ముఖమండపంలో 108 వెండి కలశాలను ఏర్పాటుచేసిన అర్చకులు కలశాలలో గంగాధి సప్తనదీ జలాలను, పంచామృతాలు, ఔషధాలతో నింపి దర్భ, మామిడి ఆకులను, కొబ్బరికాయలు, వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ముందుగా విశ్వక్సేన పూజలతో పుణ్యహవాచనం, హవన పూజలు చేసి పూర్ణాహుతిని సంప్రదాయరీతిలో జరిపారు. అనంతరం వేదపండితులు, రుత్వికులు పంచసూక్తాలు, దశశాంతులు, నారాయణసూక్తం, పంచోపనిషత్తు పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ గర్భాలయంలోని స్వయంభువులకు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అష్టోత్తరశత కలశాలతో అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకమూర్తులు స్వామి, అమ్మవార్లను తులసీదళాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చించి క్షేత్ర మహత్యాన్ని భక్తులకు వివరించారు. ఈ వైశేషిక బ్రహ్మోత్సవాలను శ్రీవైష్ణవ పాంచరాత్రగమ శాస్త్రరీతిలో దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, అర్చక బృందం, రుత్విక బృందం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

శృంగార డోల్సోతవం

బ్రహ్మోత్సవాల్లో 11 రోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగిన పూజాకైంకర్యాల్లో ఓలలాడిన కల్యాణమూర్తులు లక్ష్మీనృసింహులను పట్టుపీతాంబరాలు,



డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ముత్యాలరత్నాల ఆభరణాలు, వివిధ రకాల పూలతో దివ్య మనోహరంగా అలంకరించి డోలిక (ఊయల)లో అధిష్ఠింపజేశారు. డోలారూఢుడైన స్వామిని సకల జగత్తును రక్షింపమని కోరుతూ సర్వవిధ రాగ తాళములతో, సహస్రనామాలతో కొలుస్తూ శృంగార డోలారోహణపర్వాన్ని జరిపారు. ఆది దంపతులు లక్ష్మీనృసింహులను డోలారోహణపర్వంలో గాంచిన సకల పాపాలు తొలగుతాయని, సర్వత్రా శుభాలు వెల్లివిరుస్తాయని, నిత్యకల్యాణ మూర్తి శృంగార చేష్టలు అపూర్వమైనవని నృసింహ పురాణం తెలుపుతుందని పూజారులు వివరించారు. శృంగార డోలోత్సవ కార్యక్రమంలో డి.సులక్షణాదేవి బృందం భక్తిరసమైన కీర్తనలు ఆలపించారు. అర్చకబృందం స్వామి, అమ్మవార్లకు అత్తరు, పన్నీరు, సుగంధ ద్రవ్యాలను సమర్పించి కొలిచారు.

నేటినుంచి నిత్య మొక్కుకల్యాణాలు ఆరంభం

యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా 11రోజులుగా స్వామి వారి నిత్యకల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేశారు. గురువారం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవ వైదికపర్వాలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దీంతో శుక్రవారం నుంచి తిరిగి భక్తులు నిర్వహించుకునే శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవాలు, సుదర్శన హోమ పూజలు ఆరంభం కానున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.



స్వామికి సంప్రదాయ పూజలు

యాదగిరీశుడికి గురువారం నిత్యపూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు గర్భాలయంలోని స్వయంభువులకు, సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ముఖమండపంలో సువర్ణ పుష్పార్చనలు, అష్టోత్తర పూజలు కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి, స్పటిక మూర్తులకు నిత్య పూజలు, యాగశాలలో రుద్రహవనం స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు.

నేడు కొండేటి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

నల్లగొండ రూరల్, మార్చి 21: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని తుక్కుగూడ వివేకానంద నగర్ కాలనీలో జాగృతి ఉమెన్స్ మహిళా కళాశాల ఎదురుగా కొండేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని శుక్రవారం ప్రారంభించనున్నట్లు టీపీసీసీ జనరల్ సెక్రెటరీ కొండేటి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక హంగులతో ఆస్పత్రిని నిర్మించినట్లు తెలిపారు. ఆస్పత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని, అదేవిధంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తోపాటు, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మిర్యాలగూడలో 30 నుంచి జాతీయస్థాయి నాటకోత్సవాలు

మిర్యాలగూడ టౌన్, మార్చి 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జాతీయస్థాయి నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు సాంస్కృతిక కళాకేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి తెలిపారు. పట్టణంలోని కళాభారతి మినీ రవీంద్రభారతిలో నందినీ నాటకోత్సవాలు ఈ నెల 30న ప్రారంభమై ఏప్రిల్ 4వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పోటీలు పద్య, సాంఘిక విభాగాల్లో కొనసాగుతాయని, ఈ పోటీలకు గతేడాది సెప్టెంబరులో నోటిఫికేషన్ ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి ఎంట్రీలు రాగా 9 పద్య, 12 సాంఘీక నాటికలను తుది పోటీకి ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో దుర్గి శ్రీనివాసశర్మ, పుల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మ, చంద్రశేఖరరావు, ఉపేందర్, రామావతారం, బాబూరావు పాల్గొన్నారు.

పరిశోధనలతో రైతులకు సత్ఫలితాలు

● సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి ● ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ సుధారాణి ● నల్లగొండలో రెండు రోజులపాటు దక్షిణ తెలంగాణ వ్యవసాయాధికారుల సమావేశాలు

నల్లగొండ, మార్చి 21: విశ్వవిద్యాలయాల్లో చేస్తున్న పరిశోధనలు రైతులకు చేరువై సత్ఫలితాలు వస్తున్నాయని, 25శాతంపైగా రైతులకు విస్తరణ సేవలు లభిస్తున్నాయని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ విస్తరణ డైరెక్టర్ వి.సుధారాణి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహాసంఘ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల్లో నిరూపించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పరిశోధన ఫలాలు రైతులకు మరింత చేరువైతే రాబోయే కాలంలో వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు రూపొందించవచ్చన్నారు. ఇందుకోసం శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు రైతులతో మమేకం కావాలని కోరారు. వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అధికారులు, శాస్త్రవేత్తలు రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పప్పుదినుసులు, నూనె గింజల పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసిందని, దీని వల్ల రైతులకు వ్యవసాయంపై అవగాహన కలుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలు, సమాచారం త్వరితగతిన ఈ విధానం ద్వారా చేరుతుందన్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కావల్సిన అవసరాలను గుర్తించాలని, ఆయిల్ సీడ్స్ సీడ్ హబ్ ఉంటే రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 25శాతానికి పైగా రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విస్తరణ సేవలు పొందుతున్నారన్నారు.



నల్లగొండ కలెక్టరేట్‌లో వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా సంఘం సమావేశాలను ప్రారంభిస్తున్న సుధారాణి

రైతులు వైవిధ్యంగా ముందుకు సాగాలి

రైతులు పంటల సాగులో వైవిధ్యంగా ముందుకు సాగాలని వ్యవసాయ పరిశోధన డైరెక్టర్ వి.రఘురాంరెడ్డి సూచించారు. యాంత్రీకరణతో పంటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించాలని, రాష్ట్రానికి అవసరమైన పంటల కొరతను తీర్చే దిశగా పంటల సాగును చేపట్టాలన్నారు. రాబోయే వ్యవసాయ సీజన్‌లలో చేపట్టాల్సిన పనులపై శాస్త్రవేత్తలు, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ సహా పరిశోధన డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చేసిన పరిశోధనలు ఫలితాలనిస్తున్నాయన్నారు. అదేవిధంగా పరిశోధనల్లో సమస్యలను, పరిష్కారం గురించి వివరించారు. ఈ రెండు రోజుల సమావేశాలకు దక్షిణ తెలంగాణలోని జోగులాంబగద్వాల, వనపర్తి, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి, నల్లగొండ, వికారాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై వ్యవసాయ స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలు చేపట్టాల్సిన కార్యక్రమాలు వంటి అంశాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి, అధికారులు డాక్టర్ భరత్ భూషణ్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, పి. శ్రవణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో 26 ద్విచక్ర వాహనాలు చోరీ

● మెట్రో స్టేషన్ల వద్ద నిలిపిన వాహనాలే లక్ష్యం ● నెంబర్ ప్లేట్లు తొలగించి స్వగ్రామంలో తక్కువ ధరకు విక్రయం

బీబీనగర్, మార్చి 21: జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు ద్విచక్ర వాహనాలు చోరీచేసి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో నిర్వహించిన వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. గురువారం రాచకొండ కమిషనరేట్ డీసీపీ రాజేశ్ చంద్ర బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన కూతాడి భానుచందర్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లోని బాలాజీనగర్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తనకు వచ్చే సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో ద్విచక్ర వాహనాల దొంగతనాన్ని ఎంచుకున్నాడు. హైదరాబాద్‌లోని నాగోలు, ఉప్పల్, తదితర మెట్రో స్టేషన్ల వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించి స్వగ్రామం కొండమడుగుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విక్రయించేవాడు. నగదు అవసరం ఉండటంతో అత్యవసరంగా అమ్ముతున్నానని నమ్మబలికి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుని జల్సాలు చేసేవాడు. ఇలా హైదరాబాద్ శివారు ప్రాంతాలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, ఉప్పల్ పరిధిలో 7, ఓయూ పరిధిలో 3, బీబీనగర్ పరిధిలో 1. ఇలా మొత్తం 26 ద్విచక్ర వాహనాలను దొంగిలించాడు. ఈ నెల 20 అర్ధరాత్రి బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతూ టీఎస్ 30బీ 9841 నెంబర్ గల హోండా యూనిక్ బైకుతోపాటు పోలీసులకు పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలను అంగీకరించాడు. అతని నుంచి రూ.12లక్షల విలువైన 26 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీడీయాక్టు కేసు నమోదు చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరినట్లు తెలిపారు. దొంగిలించిన వాహనాల నెంబర్ ప్లేట్లు తొలగించడంతో వాహనదారుల గుర్తింపు కష్టంగా మారిందని, బాధితులు ఫిర్యాదు కాపీతోపాటు ఆర్‌సీ పుస్తకంతో వస్తే కోర్టు ద్వారా వాహనాలను అప్పగించనున్నట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను కొనుగోలు చేయవద్దని, ఒక వేళ కొనుగోలు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్ రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐ రమేశ్ పాల్గొన్నారు.

స్ఫూర్తిని రగిల్చే శక్తి పాటకే సాధ్యం

సూర్యాపేటటౌన్, మార్చి 21: ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని రగిల్చే శక్తి పాటకు ఉందని జాతీయ ఉత్తమ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలో మనమ్‌వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సుద్దాల అశోక్‌తేజతో సాయంత్రం అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ గాయకుడైన సుద్దాల హనుమంతు వారసుడిగా ఆయన డీఎన్‌ఏ తనలో ఉందని, ఆ ప్రేరణ పాటలు రాసేలా చేస్తుందన్నారు. పనితోనే పాట పుట్టిందని, పాటతోనే పని జతకట్టిందన్నారు. శ్రమైక జీవన విధానంలో పాట కలిసి ఉందన్నారు. పుట్టిన మొదలు మనిషి చనిపోయే వరకు పాటతో ముడిపడిఉందన్నారు. ప్రస్తుత సమాజంలో కవులకు సరైన గుర్తింపు రావడంలేదన్నారు. తాను రాసిన 3వేల పాటలకు తన చుట్టూ ఉన్న మనుషులు, వస్తువులే స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. గతంలో 1952 సూర్యాపేటలో జరిగిన మునిసిపల్ ఎన్నికల సమయంలో తన తండ్రి పాల్గొన్న సభ కోసం సినిమా థియేటర్‌లో సాయంత్రం 6గంటల చిత్రప్రదర్శనను సైతం ఆపిన చరిత్ర సుద్దాల హనుమంతుదని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి కొంత శక్తి వస్తే పరిసరాల నుంచి, జానపద పాటల నుంచి మరికొంత శక్తి వచ్చిందన్నారు. అశోకవనం, శూద్ర గంగావధానం అనే రెండు కావ్యాలను త్వరలో రచించి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కొంత మంది తనను ఎర్ర కవిగా పరిగణించారని, తాను కుర్రకవిని కూడా అని గుర్తు చేశారు. ప్రముఖ కవి, జర్నలిస్టు ప్రసేన్ మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ రాసిన అనేక పాటలు దేశభక్తిని, ప్రేరణను నింపాయన్నారు. అంతకుముందు నిర్వహించిన గానకచేరీ శ్రోతలను అలరించింది. అనంతరం కవులను, గాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మనమ్‌వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్, సుధాబ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, పెద్దిరెడ్డి రాజా, కక్కిరేణి చంద్రశేఖర్, బోనగిరి భాస్కర్, గండూరి శంకర్, రమేష్, రచయితలు, కవులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

● కుమార్తె పెళ్లి కార్డులు పంచేందుకు వెళుతూ తండ్రి.. ఆస్పత్రికి వెళుతూ యువకుడి దుర్మరణం ● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. తిప్పర్తి మండలం దుప్పలపల్లి శివారులో జరిగిన ప్రమాదంలో ఒకరు, మర్రిగూడ మండలం సరంపేట గ్రామంలో మరొకరు, చౌటుప్పల్ మండలం గుండ్లబాయిలో ఇంకొకరు, హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని.. కనగల్ మండలంలో చికిత్స పొందుతూ మరొకరు మృత్యువాతపడ్డారు.



శ్రీకాంత్, సింగం గిరి (ఫైల్‌ఫొటోలు)

తిప్పర్తి, మార్చి 21: ఆస్పత్రికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం తిప్పర్తి మండల పరిధిలోని దుప్పలపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తిప్పర్తికి చెందిన చెర్కుపల్లి శ్రీకాంత్ (28) తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో నాలుగేళ్లుగా తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గురువారం అతనికి అనారోగ్య సమస్యతో చికిత్స నిమిత్తం ద్విచక్రవాహనంపై తిప్పర్తి నుంచి నల్లగొండకు వెళ్తున్నాడు. అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో ఉన్న కేఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్ క్రాస్ చేయగానే వెనకాలే మిర్యాలగూడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న నాగాలాండ్‌కు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మృతుడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్ రిజ్వాన్‌పై కేసు నమోదు చేశారు. శ్రీకాంత్‌కు భార్య సుమలత ఉన్నారు. శ్రీకాంత్ తల్లి చెర్కుపల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

కనగల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం దోనిపాముల గ్రామానికి చెందిన ఆలేటి అశోక్(21) హాలియాలోని అత్తగారింటి నుంచి బుధవారంరాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా మార్గంమధ్యలో మండలంలోని జీఎడవల్లి గ్రామ శివారులో అతివేగం కారణంగా బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం అశోక్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మర్రిగూడ: తన కుమార్తె పెళ్లి పత్రికలు పంపిణీ చేయడానికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సింగం గిరి(50) తన కుమార్తె వివాహానికి సంబంధించిన పెండ్లి పత్రికలను గురువారం వనస్థలిపురం నుంచి సదాశివాపేటలో ఉంటున్న తమ బంధువులకు పెళ్లి కార్డులు పంపిణీ చేయడానికి కారులో బయలుదేరాడు. రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ఓఆర్‌ఆర్ రింగ్‌రోడ్డుపై ముందు వెళుతున్న లారీని వెనక నుంచి ఢీకొట్టగా కారులో ఉన్న గిరితో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో పటాన్‌చెరువు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కుమార్తె పెళ్లి వచ్చేనెల 5వ తేదీన ఉన్నందున బంధువులకు పెళ్లిపత్రికలు ఇచ్చేందుకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గిరికి భార్య, కుమారులు ఇద్దరు, ఓ కుమార్తె ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం గుండ్లబాయి జాతీయ రహదారిపై గురవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సాయికుమార్ (21), శివరాత్రి నవీన్‌లు స్నేహితులు. బైక్‌పై ఆందోళ్మైసమ్మ దేవాలయానికి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా ముందు ఉన్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టారు. ఘటనలో సాయికుమార్ మృతి చెందగా నవీన్ గాయపడ్డాడు.

కొత్తపేట: ఎల్బీనగర్ రింగ్‌రోడ్డు వద్ద టీఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో ఉండే వ్యవసాయదారుడు పాలపాటి రాధయ్య(80) గురువారం సాయంత్రం ఎల్బీనగర్‌కు వచ్చాడు. ఆయన కుమారుడైన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పాలపాటి శ్యాంసుందర్ సరూర్‌నగర్‌లోని బహదూర్‌గూడలో ఉంటున్నారు. కుమారుడి ఇంటికి వెళ్లేందుకు రాధయ్య ఎల్బీనగర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో ఉప్పల్ డిపోకు చెందిన టీఎస్‌ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలవడంతో రాధయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ద్వారా ఓ పాదచారుడు శ్యాంసుందర్‌కు సమాచారం అందించాడు. వెంటనే శ్యాంసుందర్ ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సదరు టీఎస్‌ఆర్టీసీ బస్సు డ్రైవర్ చింతకింది నరేష్‌పై కేసు నమోదు చేసి ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

31 లీటర్ల నాటుసారా పట్టివేత

మిర్యాలగూడ, మార్చి 21: నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడ మండల పరిధిలోని అయిలాపురం గ్రామశివారులో రూట్‌వాచ్ నిర్వహించి అక్రమంగా ఆటోలో 31 లీటర్ల సారా రవాణా చేస్తున్న అయిలపురం గ్రామానికి చెందిన ధానావత్ హుస్సేన్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతదేహం అప్పగింత

మిర్యాలగూడ రూరల్, మార్చి 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు సమీపంలో గల అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఈ నెల 20న లారీ ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. గురువారం ఆమె మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంనగర్‌బందం గ్రామానికి చెందిన దేవులపల్లి లక్ష్మమ్మ(65) ఈనెల 20న గూడూరు గ్రామంలో రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి వచ్చి, తన మనుమరాలు ఇంటికి వెళ్లేందుకు అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా చెన్నై వైపు వెళ్తున్న లారీ లక్ష్మమ్మను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో గూడూరు పంచాయతీ సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా గురువారం లక్ష్మమ్మ మేనల్లుడు గుర్తించినందున పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.22.65లక్షలు స్వాధీనం

నార్కట్‌పల్లి, మద్దిరాల, డిండి, కోదాడ రూరల్, తిరుమలగిరి, మిర్యాలగూడ అర్బన్, మార్చి 21: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.22.65లక్షల నగదు, రూ.5లక్షల విలువైన వెండిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన రామచంద్రారెడ్డి ఓ కారులో తరలిస్తున్న రూ.10లక్షలను వాహనాల తనిఖీలో భాగంగా నార్కట్‌పల్లిలో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఎస్.అంతిరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధి రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద కారులో తరలిస్తున్న రూ.80 వేల నగదును అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలోని కుంటపల్లి చెక్ పోస్టు వద్ద టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న రూ.1.70లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీల్లో భాగంగా చందంపేట నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలానికి మోటర్‌బైక్‌పై తరలిస్తున్న రూ.2.44లక్షల నగదును చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి చెక్‌పోస్ట్ వద్ద రూ.2,51,800లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మిర్యాలగూడ పరిధిలోని నందిపాడు బైపాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.3.04లక్షలు, రైల్వేస్టేషన్‌లో ఐదు కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



నగదును స్వాధీనం చేసుకుంటున్న నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి

ఎద్దు పొడిచి రైతు దుర్మరణం

చింతపల్లి, మార్చి 21: సాగు బాటలో తనతో కలిసే నడిచే ఆ ఎద్దే రైతు పాలిట మృత్యువైంది. మేత వేస్తున్న రైతును నుదుటి భాగంలో పొడవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం ఉదయం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం చవుళ్లతండాలో ఈ విషాదం నెలకొంది. ఎస్‌ఐ బి.యాదయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చవుళ్లతండాకు చెందిన ఇస్లావత్ దేన్యా(55) తనకున్న రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలం వద్దే గుడిసెను ఏర్పాటు చేసుకుని తన రెండు ఎద్దులను కూడా గుడిసెలోనే ఉంచడంతోపాటు ప్రతిరోజూ అక్కడే నిద్రిస్తుంటాడు. బుధవారం రాత్రి దేన్యా భార్య బిచ్చి భర్తకు ఆహారం ఇచ్చి తిరిగి ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం దేన్యా ఎద్దుకు మేత వేస్తుండగా నుదుటి భాగంపై బలంగా కొమ్ముతో పొడవడంతో దేన్యా అచేతనంగా పడిపోయాడు. అటువైపుగా వెళుతున్న కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, తండావాసులు పొలం వద్దకు వచ్చి చూడగా దేన్యా మృతిచెంది ఉండటంతో కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్‌ఐ యాదయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దేన్యాకు భార్య బిచ్చి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య బిచ్చి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని దేవరకొండ సివిల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



దేన్యా(ఫైల్)

బస్టాప్ వద్ద బస్సులు ఆపాలి


బస్సులు వెళ్లకుండా బైక్‌లు అడ్డుపెట్టిన గ్రామస్థులు

మోత్కూరు, మార్చి 21 : మండలంలోని పాటిమట్ల గ్రామ బస్టాప్ వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని గ్రామస్థులు గురువారం బైక్‌లు పెట్టి రాస్తారోకో చేశారు. బస్ డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. బస్టాప్ వద్ద బస్సులు ఆపకుంటే తాము ఇతర ప్రాంతాలకు ఎలా వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు డ్రైవర్లు క్రాస్ రోడ్డు వద్ద మాత్రమే ఆపుతున్నారని, మరికొందరు అక్కడ కూడా ఆపడం లేదని వారు ఆరోపించారు. క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లాలంటే కిలోమీటరుకు పైగా నడిచి వెళ్లాల్సి వస్తోందని, వృద్ధులు, లగేజీ, పిల్లలతో వెళ్లే వారు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఎప్పుడైనా గ్రామ బస్టాప్ వద్ద బస్సులు ఆపేవారని, మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన తర్వాతనే బస్సులు ఆపడం లేదన్నారు. బస్సులు ఆపనప్పుడు ఉచిత పథకంతో ప్రయోజనమేమిటని వారు ప్రశ్నించారు. ఒక్క ఊరిలోనే మూడుచోట్ల ఆపాలంటే ఎలా అని డ్రైవర్లు గ్రామస్థులను నచ్చజెప్పారు. చివరకు గ్రామస్థులు తొర్రూరు డిపో మేనేజర్‌కు ఫోన్‌చేయగా పాటిమట్లలో స్టాప్ ఉన్న బస్సులను అక్కడ ఆపేలా డ్రైవర్లకు చెబుతానని చెప్పారు. రెండు రోజుల్లో డ్రైవర్లు పాటిమట్ల వద్ద బస్సులు ఆపకుంటే తిరిగి రాస్తారోకో చేస్తామని గ్రామస్థులు హెచ్చరించి రాస్తారోకో విరమించారు.

తగ్గిన రేణుక ఎల్లమ్మ హుండీ కానుకల ఆదాయం

గతంతో నెలకు రూ.3 లక్షలు ● ప్రస్తుతం నాలుగు నెలలకు రూ.రూ3.66 లక్షలు


హుండీని లెక్కిస్తున్న భక్తులు

భువనగిరి టౌన్, మార్చి 21 : భువనగిరి పట్టణ శివారులోని రేణక ఎల్లమ్మ ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. గత నాలుగు నెలలకు కలిపి రూ.3,66,625 ఆదాయం వచ్చింది. అయితే గతంలో పోలిస్తే హుండీ ఆదాయం గణనీయంగా తగ్గింది. తరచుగా హుండీ చోరీకి గురవుతుండడం, ఆలయ నిర్వాహకుల వైఖరితో హుండీల్లో కానుకలను వేసే భక్తులు తగ్గిన ఫలితంగానే ఆదాయం తగ్గినట్లు పలువురు భావిస్తున్నారు. గతంలో నెలకు హుండీల ద్వారా రూ.3 లక్షల ఆదాయం లభించగా తాజాగా నాలుగు నెలలకు కలిపి కేవలం రూ.3.66లక్షల ఆదాయం మాత్రమే లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. దేవాదాయ జిల్లా ఇన్‌స్పెక్టర్ సుమతి పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు.

అవకాశవాద రాజకీయాలను ఓడించాలి: ఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

భువనగిరి టౌన్, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద రాజకీయాలను ప్రజలు ఓడించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రు అనిల్, వనం రాజు అన్నారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల ఆశలను వమ్ము చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను ఓడించేందుకు ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు శ్రమించాలన్నారు. ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో నాయకులు పల్లె శివకుమార్, లావుడియా రాజు, వేముల నాగరాజు, గంగాదేవి సాయి పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు

వలిగొండ, మార్చి 21 : అవినీతికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని మత్స్య పారిశ్రామిక సహకార అసిస్టెంట్ డైరెక్టర్ రాజారాం తెలిపారు. గురువారం మండలంలోని వెల్వర్తి గ్రామంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు అవినీతికి పాల్పడినట్లు ఆరోపిస్తూ సంఘం సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గ్రామంలోని సంఘ భవనం ఆవరణలో అసిస్టెంట్ డైరెక్టర్ విచారణ చేపట్టారు. అవినీతి చేసిన ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి నెలా సంఘ సమావేశం ఏర్పాటు నిర్వహిస్తే ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పదేళ్లుగా ఎలాంటి లెక్కలు చూపించడం లేదని, అప్పులు ఉన్నాయని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో అధ్యక్షుడు, సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వారిని డైరెక్టర్ శాంతింపజేశారు. త్వరలో విచారణ పూర్తి చేసి సభ్యులకు సరైన న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో మత్స్యశాఖ ఫీల్డ్ అఫీసర్ నర్సింహరాజు, రవినాయక్, సభ్యులు దయాకర్ శేఖర్, లింగస్వామి, రాములు, మధు, అంజయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చామల పరామర్శ


మహిపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మోత్కూరు / అడ్డగూడూరు, మార్చి 21 : మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన నేవూరి మహిపాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అతడి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పర్రెపాటి యుగంధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మునిసిపల్ కౌన్సిలర్ మలిపెద్ది రజిత, నాయకులు మల్లారెడ్డి, కారుపోతుల వెంకన్న, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, వెంకన్న, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను గురువారం టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొర్రి బాలమ్మ, డైరెక్టర్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నిమ్మన గోటీ జోజీ, నాయకులు పర్రెపాటి యుగేందర్, ననుబోతు సమ్మయ్య, అంబటి సమ్మయ్య, బోనాల నగేష్, సతీష్‌రెడ్డి, గద్దగోటీ రవి, చేడే మహేందర్, మందుల సోమన్న తదితరులు ఉన్నారు.

గుట్టలో చోరీ

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 21 : పట్టణంలో శ్రీరాంనగర్‌కు చెందిన చెరుకు వెంకటేశ్వర్లు ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో రూ.18వేల నగదు, ఆరు తులాల వెండి, సెల్‌ఫోన్ చోరీ జరిగిందని బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

పార్క్‌ల నిర్వహణ అధ్వానం

రూ.లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన భువనగిరి పట్టణంలోని మునిసిపల్ పార్క్‌లు నిర్వహణ లోపంతో అధ్వానంగా మారాయి. వేసవి తీవ్రతతో ఉక్కపోత పెరుగుతుండటం, పాఠశాలలకు వేసవి సెలవులు సమీపిస్తుండటంతో ఉపశమనం కోసం పార్క్‌లకు వెళ్లాలనుకునే వారికి నిరాశే ఎదురయ్యే పరిస్థితి ఉంది. సుమారు 15 పార్క్‌లు మాత్రమే పచ్చదనంతో ఉండగా మరిన్నీ పార్క్‌లు ఉనికిని కోల్పోతున్నాయి. పలుపార్క్‌ల్లో పిల్లల ఆట వస్తువులు, పెద్దల కోసం ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌లు అలంకారప్రాయంగా మారాయి. ఆట వస్తువులకు పగుళ్లు రాగా ఓపెన్ జిమ్ములు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో పిల్లలు, పెద్దలు వాటి జోలికి వెళ్లడం మరిచారు. వేసవి దృష్ట్యా పార్క్‌లను వినియయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

● భువనగిరి టౌన్


పచ్చదనం కరువైన శివాజీ పార్క్


దెబ్బతిన్న ఆట వస్తువులు


ఫౌంటేన్‌లో చెత్తాచెదారంతో పాటు ఆటవస్తువులు


నాటకుండానే ఎండిన మొక్కలు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బండ్రు శోభారాణి


సీఎం రేవంత్‌రెడ్డికి బోకే అందజేస్తున్న బండ్రు శోభారాణి

ఆలేరు రూరల్, మార్చి 21 : రాష్ట్ర ఉమెన్స్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బండ్రు శోభారాణి గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తనను చైర్మన్‌గా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపి, సీఎంను ఘనంగా సన్మానించారు. మహిళలకు పెద్దపీట వేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అన్నారు. 16సామాజిక వర్గాలకు కార్పొరేషన్లను ఏర్పాటుచేసిన సీఎం కురుమలకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. వీరితో పాటు మంత్రి సీతక్క కూడా ఉన్నారు.

కోతులు, కుక్కల పట్టివేతకు చర్యలు

చౌటుప్పల్ టౌన్, మార్చి 21: చౌటుప్పల్ పట్టణంలో కోతులు, కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించేందుకు అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆధ్వర్యంలో అధికారులు కార్యాచరణ చర్యలు చేపట్టారు. చాలాకాలంగా కోతులతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు తగిన రక్షణతో వ్యాపారాలను చేసుకుంటున్నారు. ఇళ్లు, వ్యాపార దుకాణాల్లోకి కోతులు చొరబడకుండా కొంతమంది యజమానులు ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కోతులు, కుక్కలను పట్టేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన బృందాలను రప్పించారు. రెండువారాల నుంచి బోనుల ద్వారా జీవాలను పట్టుకుంటున్నారు. 950 కోతులు, 1325 కుక్కలను పట్టుకొని సుమారు 250 కిలోమీటర్ల దూరంలోని అడవులలో వదిలి వేస్తున్నారు.

ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు..

ప్రజలకు ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక చర్యలను చేపట్టినట్లు మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. పెద్దసంఖ్యలో కోతులు, కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి ప్రత్యేక శిక్షణ పొందిన బృందాలతో నివారణ చర్యలను చేపట్టామన్నారు.

ప్రీతం ఎన్నిక కాంగ్రెస్ కార్యకర్తలకు గర్వకారణం


ప్రీతంను సత్కరిస్తున్న జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు

భువనగిరి టౌన్ / యాదగిరిగుట్ట రూరల్ / ఆలేరురూరల్, మార్చి 21: రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతం నియమితులు కావడం కార్యకర్తలకు గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగారం శంకర్, జిల్లా అధ్యక్షుడు దర్గాయి హరిప్రసాద్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ప్రీతంను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయన్ను ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో నాయకులు కొండాపురం గణేష్, గోపి శ్రీనివాస్, కిష్టయ్య, మల్లేష్, రఘు, భాస్కర్ పాల్గొన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రీతంను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దర్గాయి హరిప్రసాద్, గుట్ట మండల అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు బూడిద భాస్కర్, సించు వినోద్, పరశరాం, జేరిపోతుల చంద్రయ్య, జహంగీర్, కరుణాకర్, రాజు పాల్గొన్నారు. అదేవిధంగా ఆలేరు మండలానికి చెందిన ఎస్సీ సెల్ నాయకులు ప్రీతంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కిష్టయ్య, నాగరాజు, పిట్టల కిష్టయ్య, కంతి భిక్షపతి, తదితరులు ఉన్నారు.

బీయన్‌తిమ్మాపురంలో మత్స్యపారిశ్రామిక సంఘ ఎన్నికలు

భువనగిరి రూరల్, మార్చి 21 : భువనగిరి మండలం బీఎన్‌తిమ్మాపురం మత్స్యపారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులుగా జిన్న రాజు, కుశంగుల ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా జిన్న శ్రీను, కోశాధికారిగా చిక్కుడు కుమార్, ప్రచార కార్యదర్శిగా జిన్న అనిల్, డైరెక్టర్‌గా జిన్న సుశీలను ఎన్నుకున్నట్లు కో ఆపరేటివ్ రిజిస్టర్ ఈశ్వరయ్య తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం కులపెద్దలు వల్దాసు రాజు కాళభైరవ, జిన్న నర్సింహ, శ్రీశైలం, బాలరాజు, ధన్‌రాజు, సత్యనారాయణ ఉన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

మోత్కూరు, మార్చి 21 : నాలుగు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కార్మికులకు ఇచ్చేది అరకొర వేతనమని, అదీ కూడా నెలనెలా చెల్లించకుండా, నాలుగైదు మాసాలు నిలిపివేస్తే వారి కుటుంబాలను ఎలా వెళ్లదీస్తారని ప్రశ్నించారు. మల్టీపర్పస్ పనివిధానం రద్దు చేయాలని, ప్రతి నెలా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పానుగుల రమేష్, పిట్టల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 21 : మండలంలోని మర్రిబావితండాలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు గురువారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి కోరారు. పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. వారి సమస్యలు విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెగావత్ రాజు, నాయకులు ధర్మానాయక్, శ్రీనునాయక్, సభావత్‌నాయక్, సేవానాయక్, శ్రీధర్‌నాయక్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలి

రామన్నపేట, మార్చి 21 : మహిళలు స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలని సింగిల్ విండో డైరెక్టర్ కల్లూరి సైదమ్మనాగేశ్ అన్నారు. మండలంలోని పల్లివాడ గ్రామంలో మూడు నెలలుగా న్యాక్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పొందిన మహిళలకు డైరెక్టర్ కల్లూరి సైదమ్మ కత్తెరలను అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ టీచర్ నవ్య, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి పావిరాల మత్స్యగిరి, మాజీ వార్డు సభ్యులు బైకానీ నర్సదానరసింహ, జనాపాల లక్ష్మణ్, గట్టు నరసింహ, శిక్షణ సభ్యులు నాంపల్లి ఉమారాణి, కల్లూరి మాధవి, మల్లెపాక వసంత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవి

ఆలేరు రూరల్, మార్చి 21 : ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జూకంటి రవి ఎన్నికయ్యారు. గురువారం ఆలేరులో నిర్వహించిన సంఘ ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశామన్నారు. తనను ఎన్నుకున్న న్యాయవాదులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా పాండు



తుర్కపల్లి, మార్చి 21:బీజేపీ జిల్లా కార్యదర్శిగా మల్లాపూర్ గ్రామానికి చెందిన మేకల పాండు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శిగా భాస్కర్‌గౌడ్



చౌటుప్పల్ రూరల్, మార్చి 21 : భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పంతంగి గ్రామానికి చెందిన దిండు భాస్కర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మోర్చా బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ, మార్చి 21 : బీజేపీ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శులుగా మారోజు అనిల్ కుమార్, లోడె లింగస్వామి, ఉపాధ్యక్షులుగా దయ్యాల వెంకటేశం, జోగిపర్తి సంతోష్, గంగదారి దయాకర్, వేల్పుల కొమురెల్లి, రుద్రపల్లి మత్స్యగిరి, రావుల పద్మారెడ్డి, కార్యదర్శులుగా మైసోళ్ల చిన్న మత్స్యగిరి, బైరు మల్లేశం, మందుల నాగరాజు, చిలకమరి లావణ్య, కొండపర్తి రాజేష్, గంగపురం నరేష్, కోశాధికారిగా అప్పిశెట్టి సంతోష్, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా రంజిత్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీఎన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రాచకొండ కృష్ణ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రేగూరి అమరేందర్, సీనియర్ నాయకులు కణతాల అశోక్‌రెడ్డి, సీలోజు శ్రీరాములు బచ్చు శ్రీనివాస్, కందుల తానీషా పాల్గొన్నారు.

బూత్ కమిటీ ఏర్పాటు

చౌటుప్పల్ టౌన్, మార్చి 21: చౌటుప్పల్ పట్టణ 37, 39 పోలింగ్ బూత్‌ల ప్రత్యేక సమావేశాన్ని గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించి నూతన కమిటీలను ఏర్పాటుచేశారు. 37వ బూత్ అధ్యక్షుడిగా గజం ఆనంద్, 39 వ బూత్ అధ్యక్షుడిగా గుండ్ల శివలు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ దంపతులు


ఎమ్మెల్యే కుంభం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ గోళి ప్రణీతపింగల్‌రెడ్డి దంపతులు

బీబీనగర్, మార్చి 21 : బీబీనగర్ మండలంలో బీఆర్ఎస్‌కు ఆ పార్టీ నేతలు భారీ షాక్ ఇచ్చారు. జడ్పీటీసీ గోళి ప్రణీత, పింగల్‌రెడ్డి దంపతులు, పట్టణ తాజా మాజీ సర్పంచ్ మల్లగారి భాగ్యలక్ష్మీశ్రీనివాస్ దంపతులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. గురువారం ఉదయం వీరు బీఆర్ఎస్ అనుబంధ విభాగాలకు చెందిన మండల స్థాయి నేతలు, ఇతర అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నారగోని మహేష్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు ఎలుగుల నరేందర్, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు కాసుల సత్యనారాయణగౌడ్, మైనార్టీ నేతలు ఎండీ అక్బర్, ఎండీ మోహిన్ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పొట్టోళ్ల శ్యాంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, బీబీనగర్ ఎంపీటీసీ గోళి నరేందర్ రెడ్డి, పెంటయ్యగౌడ్, ప్రవీణ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో మనోవికాస వృద్ధి సాధించాలి


మోటీవేషన్ స్పీకర్లుగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి రూరల్, మార్చి 21 : ఆత్మస్థైర్యంతో మనోవికాస వృద్ధి సాధించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మోటివేషన్ స్పీకర్ గంపా నాగేశ్వరరావు స్థాపించిన ఇంపాక్ట్ ఫౌండేషన్ హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన శిక్షణకు భువనగిరి మండలం అనంతారం గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై, సర్టిఫికెట్లు పొందారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో కొంతమంది విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతూ తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తమవంతుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, శ్రీనివాస్, రజిత, సుభాషిని, శ్రీవాణి, శ్రీలత, స్నేహలత, కవిత, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన నెమలికి చికిత్స


మోత్కూరు పశువైద్యశాలలో నెమలికి చికిత్స చేస్తున్న ఏడీ డాక్టర్ మోతీలాల్

ఆత్మకూర్(ఎం) / మోత్కూరు, మార్చి 21 : ఆత్మకూర్(ఎం) మండలంలోని పల్లెర్లలో అస్వస్థతకు గురైన నెమలిని రైతులు గుర్తించారు. గ్రామానికి చెందిన నిమ్మ రెడ్డి నర్సిరెడ్డి, నరేందర్‌రెడ్డి రోజు మాదిరిగానే గురువారం తమ వరి పొలంలో నీటిలో సగం వరకు మునిగి ఉన్న నెమలి కన్పించింది. నెమలి నీటిలోంచి లేవలేకపోతున్నట్లు గమనించి బయటకుతీశారు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన ఫారెస్టు సెక్షన్ అధికారి ఎల్లేష్‌కు నెమలిని అప్పగించారు. నెమలిని కాపాడిన రైతు సోదరులు నర్సిరెడ్డి, నరేందర్‌రెడ్డిలను అటవీ శాఖ అధికారి ఎల్లేష్ అభినందించారు.

మోత్కూరులో పశు ఆసుపత్రిలో చికిత్స

ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో రైతు నరేందర్‌రెడ్డి అటవీ శాఖ అధికారులకు అందజేసిన నెమలిని మోత్కూరు పశువుల ఆసుపత్రికి తరలించారు. దానిని పశుసంవర్థక శాఖ ఏడీ మోతీలాల్ పరీక్షించి చికిత్స అందించారు. నెమలి క్రమంగా కోలుకుంటుండటంతో కొంతసేపు డాక్టర్ పర్యవేక్షణలోనే ఉంచి ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత తీసుకెళ్లి అడవిలో వదిలిపెడతామన్నారు.

సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజ



కుట్టుమిషన్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

భువనగిరి రూరల్, మార్చి 21 : సమాజ సేవ కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా ముందంజలో ఉందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసి రెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలో రోటర్ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో రూ.28వేల విలువైన నాలుగు కుట్టుమిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. అదేవిధంగా డాక్టర్ సుమంత్ సహకారంతో శస్త్రచికిత్సల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముగ్గురికి రూ.50వేల విలువగల కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఫకీరు కొండల్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ కే నిమ్మయ్య, డాక్టర్ యంపాల బుచ్చిరెడ్డి, దిడ్డి బాలాజీ, గడ్డం జ్ఞాన్ ప్రకాశ్‌రెడ్డి, లింగారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు. భువనగిరి పోర్టు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమంలోక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, పలుగుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

చౌటుప్పల్ టౌన్, మార్చి 21: చౌటుప్పల్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో వచ్చే నెల 16, 17 తేదీల్లో నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ బొబ్బిళ్ల మురళి తెలిపారు. దేవాలయంలో గురువారం ప్రధాన అర్చకులు పెద్ది సుధాకర్‌శర్మ సమక్షంలో చైర్మన్ మురళి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ బస్‌స్టేషన్ ఆవరణలోని నాలుగు ఎకరాల స్థలంలో కళ్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవానికి 10 వేల మంది భక్తులు హాజరవుతారని ఆయన అన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో కమిటీ డైరెక్టర్లు గుర్రం వెంకటేశం, కామిశెట్టి చంద్రశేఖర్, తూర్పాటి నర్సింహ, పోలోజు శ్రీలత శ్రీనివాస్‌చారిలు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎంపిక

ఆత్మకూరు(ఎం) మార్చి 21: మండలంలోని కొరటికల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సోలిపురం రమణ ఎంపికైనట్లు హెచ్ఎం స్వప్న తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

వలిగొండ, మార్చి 21:మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన వల్లమల్ల నర్సింహ మృతి చెందాడు. అయన కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో కుంభం ప్రేమలత శ్రీనివాస్‌రెడ్డి ట్రస్ట్ రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పీసరి వెంకట్‌రెడ్డి, నాయకులు ఎల్లాగౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

మోత్కూరులో నేడు రక్తదాన శిబిరం

మోత్కూరు, మార్చి 21 : మోత్కూరు ఈ నెల 22న రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మోటార్స్ యజమాని మెట్టు మంగేష్, రెడ్‌క్రాస్ మోత్కూరు మండల అధ్యక్షుడు సత్యనాథ్ గురువారం విలేకరులకు తెలిపారు.

జాబ్‌కార్డులు ఉన్న వారికి పని కల్పించాలి

ఆలేరు రూరల్, మార్చి 21 : జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం కింద పనిని కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మంతపురిలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు పనిముట్లు కల్పించాలని, పనిచేస్తున్న ప్రాంతం దూరంగా ఉంటే రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, యాదమ్మ, నర్సయ్య, తదితరులు ఉన్నారు.


కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న చెక్క వెంకటేష్

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 21 : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు చెరుపల్లి లక్ష్మయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం చేనేత కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేనేత కార్మికుల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమం కోసం చేనేతకు చేయూత పథకాన్ని ప్రారంభించారని, ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడంలేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా చేనేత కార్మికులు తీసుకున్న బ్యాంక్ రుణాలు రైతుల మాదిరిగా రుణమాఫీ చేయాలని కోరారు. బ్యాంక్ అధికారులు రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం చేనేత వస్త్రాలకు గిరాకీ లేనందున కార్మికులకు పనిలేక కార్మికుల భవిష్యత్ అంధకారంలో పడిపోయిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి చేనేత కార్మికుల ఇబ్బందులను తొలగించి ఆకలి చావులను అరికట్టి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగం కృష్ణ, విడం సాయికిషోర్, దోర్నాల కృష్ణబాబు, గంజి అంజయ్య, సింగం భాస్కర్, వెంకటేశం, గంజి అశోక్, గుర్రం సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.